క్లుప్తంగా

అందుబాటులో 108 సేవలు



మండలానికి మంజూరైన 108 వాహనాలు

లింగాపూర్: మండల కేంద్రానికి నూతనంగా 104, 108 వాహనాలు మంజూరయ్యాయి. బుధవారం ఈ వాహనాలను అధికారులు ప్రారంభించారు. ఈఎంటీ హీరాజీ, విజయ్‌కాంత్ మాట్లాడుతూ.. అంబులెన్స్ లేక మండల ప్రజలు అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లేందుకు ఇబ్బంది పడేవారు. అత్యవసర వాహనాలు మంజూరవడంతో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోకేందర్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న వీవోఏ శ్రీధర్

కెరమెరి: మహిళా సంఘంలో ఉన్న మహిళలకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. మండలంలోని మొత్తం 34 వీవోలు ఉండగా.. 30 వీవోలకు, 580 గ్రామైఖ్య సంఘాలకు, 480 ఎస్‌హెచ్‌జీలోని 3523 మంది మహిళలకు ఐకేపీ సీసీలు, వీవోఏలు చీరలు పంపిణీ చేశారు. సంఘాల వారీగా చీరలను పంపిణీ చేసినట్లు ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ తెలిపారు.

అధికారులకు సన్మానం



అధికారులకు సన్మానిస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలోని గడిచిన కొన్నేళ్లుగా కెరమెరి విద్యుత్ శాఖ ఏఈగా శ్రీనివాస్, ఎల్ఐగా రాజశేఖర్ విధులు నిర్వహించిన బదిలీ అయిన వారిని బుధవారం కెరమెరి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన ఏఈ రమేశ్‌తో పాటు విద్యుత్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది కుమారస్వామి, సన్మాన్‌రావు, సుదర్శన్, రంజిత్‌కుమార్, రవీందర్, మోహన్, మారుతి, అశోక్, రవి, వినోద్, జగదీశ్, రాజు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



సరుకులు పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

బెజ్జూర్: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని తహసీల్దార్ భుమేశ్వర్, ఎంపీడీవో గౌరీశంకర్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. కూరగాయలు, పప్పు దినుసులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేకాధికారికి సూచించారు.

16న ఆయుర్వేద వైద్య శిబిరం

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఈనెల 16న సింగరేణి సేవా సమితి, మాతా రీసెర్చ్ సెంటర్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని సింగరేణి ఉద్యోగులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్ల, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం, అజీర్ణం, ఆస్తమా వంటి వాటితో బాధపడే వారికి వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

దారి కోసం శ్రమదానం

తిర్యాణి: గ్రామాలకు వెళ్లే రోడ్డు సరిగా లేకపోవడంతో గ్రామస్తులు దారి కోసం బుధవారం శ్రమదానం చేసి బాగు చేసుకున్నారు. బుధవారం మండలంలోని తాటిగూడ, గీసిగూడ, కేరగూడ గ్రామాలకు చెందిన ప్రజలు తమ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఐక్యంగా శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి, గ్రామస్తులు రాయిసిడాం మెతిరాం, కుంరం శంకర్, బారిక్‌రావు, ఆత్రం రాజు పాల్గొన్నారు.

యాసంగి పనులు షురూ

- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు
- వరినాట్లకు సిద్ధమవుతున్న పొలాలు

రెబ్బెన: మండల వ్యాప్తంగా యాసంగి పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పనులు కాస్త మందకోడిగా సాగుతున్నాయి. వానాకాలం వరి కోతలు పూర్తి కాగానే రైతులు యాసంగి సాగుపై దృష్టి పెట్టారు. వరి కోతలు ముందస్తుగా పూర్తి చేసుకున్న రైతులు 25 రోజుల క్రితమే వరినారు పోసుకున్నారు. మరోవారం రోజుల్లో నాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. పొలాలను నీటితో తడపటం, దమ్ము చేయడం వంటి పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

2200 ఎకరాల్లో వరి సాగు..

ఈసారి యాసంగిలో మండల వ్యాప్తంగా 2200 ఎకరాల్లో పంటలు సాగు అవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. బోరు మోటర్లతో పాటు వాగులకు సమీపన ఉన్న భూముల్లో, వట్టివాగు ప్రాజెక్టు కాలువ కింద యాసంగి వరిసాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. రెబ్బెన, నంబాల, కొమురవెల్లి, నారాయణపూర్, కిష్టాపూర్, ఫకీర్‌పల్లి, తక్కళ్లపల్లి ప్రాంతాల్లో బోరు మోటార్ల కింద వరి సాగు చేస్తున్నారు. పుంజుమేరగూడ, నక్కలగూడ, ఖైరిగాం, ఎడవెల్లి ప్రాంతాల్లో రైతులు బోరు మోటార్లు, వట్టివాగు కాలువ నీటిపై ఆధారపడుతున్నారు. గత ఏడాది యాసంగిలో 2100 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా.. ఈసారి 2200 వరకు సాగు విస్తీర్ణం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సన్నాల సాగుకే మొగ్గు..



రెబ్బెన శివారులో నాటు వేసేందుకు సిద్ధంగా ఉన్న వరినారు

సాధారణంగా వానాకాలం సీజన్‌లో రైతులు సన్న రకం వరిని సాగు చేస్తే యాసంగిలో మాత్రం దొడ్డు రకం వరి సాగును చేపట్టేందుకు ఆసక్తి చూపుతారు. సన్నరకం పంటకాలంతో పోల్చితే దొడ్డురకం వరిసాగు పంటకాలం తక్కువగా ఉండటంతో పాటు దొడ్డు రకానికి చీడపీడలు, తెగుళ్ల బెడద కాస్త తక్కువగా ఉంటుంది. దీంతో రైతులంతా యాసంగిలో దొడ్డురకం వరిసాగుకే ప్రాధాన్యత ఇస్తారు. గత ఏడాది నుంచి మండలంలోని అధికశాతం రైతులు యాసంగిలో దొడ్డు రకానికి బదులు సన్నరకం వరిసాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. దొడ్డురకం వరిసాగు చేపడితే ధాన్యాన్ని తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ, తప్ప, తాలు పేరుతో భారీగా కోతలు విధిస్తుండటంతో దొడ్డురకాన్ని వదిలేసి సన్నాల సాగుకే ఆసక్తి చూపుతున్నారు.

యాసంగి పనులు ప్రారంభమయ్యాయి

మండలంలో యాసంగి పంటల సాగు పనులు మొదలయ్యాయి. రెబ్బెన, నక్కలగూడ, పుంజుమేరగూడ, ఖైరిగాం ప్రాంతాల్లో వరినారు సిద్ధం చేస్తున్నారు. నంబాల, నారాయణపూర్ వంటి ప్రాంతాల్లో ఆలస్యంగా సాగు పనులు మొదలవుతాయి. జనవరి లోపు వరినాట్లు పూర్తి చేసుకుంటే పంటలో ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుంది.

– సంజీవ్, వ్యవసాయ విస్తరణ అధికారి

కనుల పండువగా పడిపూజ



పడిపూజలో స్వాములు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని సాయినివాడలో బుధవారం రాత్రి అయ్యప్ప పడిపూజ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆదిలాబాద్‌కు చెందిన పండితులు, గురుస్వాములు మేఘరాజ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 18 కలశాలు, పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేసిన అనంతరం స్వామి వారికి చక్రస్నానం చేయించారు. కాగజ్‌నగర్, బెల్లంపల్లికి చెందిన గాయకుల పాటలు అలరించాయి. గురుస్వాములు మోహన్, శ్యాంసుందర్, చంద్రమోహన్, శ్రీధర్, బాలరాము, శ్రావణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

‘అసత్య ప్రచారాలను సహించం’



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: ఆదివాసీ కొలవార్ కులస్తులు ఎస్టీలు కాదంటూ కొలాం సంఘ నాయకులు అసత్య ప్రచారం చేయడం సరికాదని ఆదివాసీ కొలావర్ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మెర్పల్లి సదాశివ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ కోలావార్ సేవా సంఘం భవనంలో మాట్లాడారు. ఆదివాసీ చట్టాలపై కనీసం అవగాహన లేకుండా కించపరిచే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. అవహేళన చేస్తే సహించమని, రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పారిపెల్లి పోశం, మెర్పల్లి బ్రహ్మయ్య, అశోక్, శ్రీనివాస్, శంకర్, నాగయ్య, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్, పోతేపెల్లి గ్రామాలకు చెందిన లబ్దిదారులకు బుధవారం బీజేపీ నాయకులు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు సామల తిరుపతి, రాజారాం, సంజీవ్, నీకురి రమేశ్, నారాయణలు మాట్లాడారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆదేశాల మేరకు చిన్నసిద్దాపూర్ గ్రామానికి చెందిన రాకిరే పోచయ్య, పోతేపెల్లి గ్రా మానికి చెందిన రేణుకకు చెక్కులు పంపిణీ చేసిన ట్లు తెలిపారు. ప్రవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకొని సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వారికి దళారుల ప్రమేయం లేకుండా స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వాలీబాల్ కిట్ అందజేస్తున్న సీఐ, ఎస్సై

కౌటాల: పులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కౌటాల సీఐ ముత్యం రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని జనగాం గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులి సంచారంపై వదంతులు నమ్మవద్దన్నారు. వ్యవసాయ పనులకు రైతులు గుంపులుగా వెళ్లాలని సూచించారు. రాత్రి సమయంలో ఒంటరిగా బయట తిరగవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని, ఎవరికీ ఏటీఎం, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పవద్దన్నారు. ఏదైనా సమస్యలుంటే 100కు డయల్ చేయాలన్నారు. అనంతరం యువతకు వాలీబాల్ కిట్, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టుపై దాడికి పాల్పడిన సినీ నటుడు మోహన్‌బాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు బుధవారం జిల్లా కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మంచు కుటుంబంలో చెలరేగిన వివాదాన్ని కవరేజ్ చేసేందుకు వెళ్లిన జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడికి చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన మోహన్‌బాబుపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

రేపు బెజ్జూర్‌లో సమావేశం



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల(సిర్పూర్): బెజ్జూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఆదివాసీ కొలావార్ సంక్షేమ సంఘం జిల్లా సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు తెలిపారు. కౌటాలలోని సంఘం భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 13న ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి కొలావార్ సంక్షేమ సంఘం రాష్ట్ర జాతీయ అధ్యక్షుడు సుంకె కిష్టయ్య హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కుర్మ రాజు, సత్తయ్య, కార్తీక్, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతు చేపట్టాలి



మాట్లాడుతున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో ఉన్న వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టాలని వాకర్స్ అసోసియేషన్ నాయకులు మల్రాజు శ్రీనివాస్‌రావు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ఉద్యోగులు, వారి కుటుంబసభ్యుల కోసం భీమన్న స్టేడియంలో గతంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసిందన్నారు. ట్రాక్ మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండటంతో వాకింగ్ చేసే సమయంలో ఇబ్బంది పడుతున్నారన్నారు. స్టేడియంలోని మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవటంతో అపరిశుభ్రంగా మారాయన్నారు. వెంటనే పరిశుభ్రం చేసి వినియోగం లోకి తీసుకురావాలన్నారు. యాజమాన్యం స్పందించి వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఉపేందర్, సాగర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సబ్సిడీ సిలిండర్ల పట్టివేత

కౌటాల: మండల కేంద్రంలోని హోటళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు రాజ్‌కుమార్, శ్రీనివాస్‌లు బుధవారం ఉదయం తనిఖీలు చేపట్టా రు. ఈ సందర్భంగా వారు ఏ1 హోటల్‌లో మూడు, వంశీ టిఫిన్ సెంటర్లలో 6, అక్షర టిఫిన్ సెంటర్‌లో 2, బాలాజీ బేకరీలో 4 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో మొత్తం 15 సిలిండర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. హోటళ్లలో కమర్షియల్ సిలిండర్లను వినియోగించాలన్నారు. డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సరిహద్దులు దాటుతున్న రేషన్

- మహారాష్ట్రకు అక్రమంగా బియ్యం తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



సిర్పూర్(టి)లో అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం

కౌటాల: పేదల ఆకలి తీర్చే రేషన్ బియ్యం అక్రమార్కుల జేబులను నింపుతోంది. ఈ అక్రమ దందాకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తుండడంతో రాయితీ బియ్యం పొరుగున ఉన్న మహారాష్ట్రలోని ఆయా గ్రామాలకు తరలుతుంది. దళారులతో పాటు రేషన్ డీలర్లు సైతం లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి దందాను కొనసాగిస్తున్నారు. జిల్లాలో పీడీఎస్ బియ్యం దందాను అరికట్టడం కోసం అధికారులు, పోలీసుశాఖ చేస్తున్న ప్రయత్నాలకు రేషన్ డీలర్లే గండికొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పీడీఎస్ దందాకు డీలర్లే సహకరిస్తుండడంతో ఈ దందా బహిరంగానే కొనసాగుతోంది. అధికారులు తనిఖీలు చేపడుతున్నా.. కొత్తదారుల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

బియ్యంకు బదులు డబ్బులు..

పేదలకు పంపిణీ చేసే రేషన్ దుకాణాల్లో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వినియోగదారుడి చేతి వేలి ముద్ర తీసుకొని వారికి రేషన్ బియ్యం ఇవ్వకుండా నిత్యావసర వస్తువులు ఇస్తూ, రేషన్ దుకాణాన్ని నిత్యావసర దుకాణంగా మారుస్తున్నారు. కొందరు డీలర్లు లబ్దిదారులకు దుకాణాల వద్దే నేరుగా కిలోకు రూ. 16 నుంచి రూ. 18 వరకు డబ్బులు ఇస్తున్నారు. 15– 20 క్వింటాళ్ల వరకు పోగు చేసి మహారాష్ట్రలో రూ. 26 నుంచి రూ. 30 వరకు విక్రయిస్తున్నారు. ఇక్కడ పాలిష్ చేసి, ప్యాక్ చేసి ఇతర ప్రాంతాలకు అమ్ముతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగజ్‌నగర్ అడ్డగా మంచిర్యాల, బెల్లంపల్లి, రెబ్బెన నుంచి, మరోవైపు ఆసిఫాబాద్ నుంచి సిర్పూర్(టి) మీదుగా రేషన్ బియ్యంను మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

ప్రధాన హస్తం డీలర్లదే..

జిల్లాలోని 15 మండలాల్లో 334 గ్రామ పంచాయతీలుండగా.. అందులో 303 రేషన్ షాపులున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,39,784 ఆహార భద్రత కార్డులుండగా.. 13,024 అంత్యోదయ కార్డులున్నాయి. 21 అన్నపూర్ణ కార్డులుంగా వీరికి ప్రతీ నెల 3 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో చాలా మంది ప్రజలు సన్నబియ్యం తింటుండటం, ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండడంతో చాలా మంది వాటిని తినడానికి ఇష్టపడడం లేదు. రేషన్ దుకాణాల్లో విక్రయించి వాటి బదులు డబ్బులు, నిత్యావసర వస్తువులు తీసుకుంటున్నారు. దీంతో నేరుగా డీలర్లే పెద్ద మొత్తంలో రేషన్ బియ్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం వేలిముద్రల నిబంధన ప్రవేశపెట్టినా.. అక్రమ దందా మాత్రం ఆగడం లేదు. ఈ దందా అధికారులకు తెలిసినా 'మామూళ్లు' అందుతుండడంతో అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ బియ్యం దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇటీవల బియ్యం పట్టుబడిన ఘటనలు..

- ఈనెల 5న కాగజ్‌నగర్ నుంచి సిర్పూర్(టి) మండల కేంద్రం మీదుగా మహారాష్ట్రకు బొలెరొ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పక్కా సమాచారం మేరకు అధికారులు పట్టుకున్నారు.
- కౌటాల మండలం తలోడి గ్రామ సమీపంలో ఈనెల 7న వేకువజామున ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 7.80 క్వింటాళ్ల రేషన్ బియ్యంను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు.
- ఈనెల 9న చింతలమానెపల్లి మండలం డబ్బా క్రాస్‌రోడ్ వద్ద అర్ధరాత్రి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 48.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను అధికారులు పట్టుకున్నారు.

హోరాహోరీగా సీఎం కప్ పోటీలు



పరిచయం చేసుకుంటున్న అధికారులు

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజు సీఎం కప్– 2024 మండల స్థాయి పోటీలను హోరాహోరీగా సాగాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు రసవత్తరంగా జరిగాయి. బాలుర కబడ్డీలో మొగడ్‌దగడ్ జట్టు విజేతగా, తాటిపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలికల్లో కౌటాల జట్టు ప్రథమ స్థానం, ముత్తంపేట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. వాలీబాల్‌లో ముత్తంపేట జట్టు మొదటి స్థానం, కౌటాల రెండో స్థానంలో నిలిచింది. ఖోఖో బాలురలో కౌటాల జట్టు ప్రథమ స్థానం, ఇన్‌ఫంట్ పాఠశాల ద్వితీయ జట్టు, బాలికలో కౌటాల జట్టు, జూనియర్ కళాశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, హెచ్‌ఎం నారాయణ్‌సింగ్, పీడీలు హరికృష్ణ, వాణి, పీఈటీలు సౌందర్య, రమేశ్, కార్యదర్శులు సాయి కృష్ణ, భాస్కర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ పోటీల్లో భాగంగా 100, 200, 400 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అల్బర్ట్, పీఈటీలు నాగరాణి, తిరుపతి, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సీఎంకప్ క్రీడా పోటీలు

దహెగాం: మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను గురువారం మండలంలోని కల్వాడ ఆశ్రమ పాఠశాలలోని క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు క్రీడాకారులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బెజ్జూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీవో గౌరీ శంకర్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. సీఎం కప్ మండలస్థాయి పోటీల్లో మండలంలోని మర్తిడి ఓవర్ కామర్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో బుస శంకర్, రాచకొండ శ్రీవర్ధన్, సామల తిరుపతి పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ క్రీడాపాఠశాలలో బుధవారం సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలను ఆర్డీవో లోకేశ్వర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికి తీయడమే సీఎం కప్ క్రీడాపోటీల ముఖ్య ఉద్దేశమన్నారు. ఆసిఫాబాద్ మండలం నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ చూపిన 120 మందిని జిల్లాస్థాయికి ఎంపిక చేశామన్నారు. డీఎస్‌వో మీనారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, హెచ్‌ఎం జంగు, పీడీ, పీఈటీలు విద్యాసాగర్, మధుసూదన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: బీఆర్‌ఎస్‌తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని జిల్లా నాయకులు నక్క శంకర్ అన్నారు. బుధవారం కౌటాల ఆరె సంక్షేమ సంఘం భవనంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. సిర్పూర్‌లో పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు పని చేయాలన్నారు. సమావేశంలో నాయకులు నాందేవ్, నవీన్, కార్తీక్, ఆనంద్, సందీప్, లక్ష్మణ్, రాహుల్, మాంగేశ్, శివరాం, తదితరులు పాల్గొన్నారు.